# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 17-12-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ప్రభుత్వ సేవలన్ని ఆన్‌లైన్‌లోనే అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు .**

2. **గ్రామాలకు విద్యుత్ సౌకర్యంతో పాటు మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యమన్న ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్.**

3. **భారత మాజీ ప్రధాని భారతరత్న అటల్ బీహారీ వాజ్‌పేయీ విలువలతో కూడిన రాజకీయాలు చేశారని పేర్కొన్న విద్యాశాఖ మంత్రి నారాలోకేశ్.**

4. **మహిళల వన్డే ప్రపంచ కప్‌లో అద్భుత ప్రదర్శన చేసిన మహిళా క్రికెటర్ శ్రీచరణికి రెండు కోట్ల 50 లక్షల నగదు ప్రోత్సహకాన్ని అందజేసిన ప్రభుత్వం.**

==========================

ప్రభుత్వ సేవలన్ని ఆన్‌లైన్‌లోనే అందించేందుకు కృషి చేస్తున్నట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో జిల్లా కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి ఈరోజు మాట్లాడారు. ఏ పనిచేస్తున్నా వివరాలు సమగ్రంగా ఉండాలని జిల్లా కలెక్టర్లకు ముఖ్యమంత్రి సూచించారు. అనుకున్న సమయానికి లక్ష్యాలు నెరవేరేలా అధికారులు పని చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చెబుతూ..

వాయిస్..30 సెకన్లు

-------------------------

గ్రామాలకు విద్యుత్ సౌకర్యంతో పాటు మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి కే.పవన్ కల్యాణ్ అన్నారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో జిల్లా కలెక్టర్ల సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. మారుమూల గిరిజన గ్రామాల అభివృద్ధిపైన కలెక్టర్లు దృష్టి పెట్టాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం అందించే పథకాల అమలులో వంద శాతం ఫలితాలు సాధించాలని పేర్కొన్నారు.

-------------------------

తమిళనాడు రాష్ట్రంలో ఒకరోజు పర్యటనలో భాగంగా భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయానికి ఈరోజు ఉదయం చేరుకున్నారు. విమానాశ్రయంలో రాష్ట్ర గవర్నర్ ఎస్.

అబ్దుల్ నజీర్, బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత ఆమెకు స్వాగతం పలికారు. అనంతరం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తమిళనాడు రాష్ట్రంలోని వేలూరు స్వర్ణ దేవాలయానికి ప్రత్యేక హెలికాప్టర్‌లో బయలుదేరి వెళ్లారు. ఈరోజు మధ్యాహ్నం 3 గంటలకు తిరిగి తిరుపతి విమానాశ్రయం నుంచి హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్లనున్నారు.

---------------------------

వైకుంఠ ఏకాదశి సందర్భంగా వచ్చే భక్తుల కోసం తిరుమల తిరుపతి దేవస్థానం అన్ని ఏర్పాట్లు చేస్తోందని బీసీ సంక్షేమశాఖ మంత్రి ఎస్. సవిత తెలిపారు. తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామివారిని ఆమె కుటుంబ సమేతంగా ఈరోజు దర్శించుకున్నారు. అనంతరం ఆలయ వెలుపల పాత్రికేయులతో మాట్లాడుతూ.. తిరుమలలో సామాన్య భక్తులకు ఉపయోగపడేలా టిటిడి పాలకమండలి నిర్ణయాలు ఉన్నాయని పేర్కొన్నారు. తిరుమలలో జరుగుతున్న మార్పులపై భక్తులందరూ సంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు మంత్రి సవిత తెలియజేస్తూ..

వాయిస్..30 సెకన్లు

---------------------------

గ్రామీణ కుటుంబాలకు ప్రతి సంవత్సరం 125 రోజుల వేతన ఉపాధికి చట్టబద్ధ హామీ కల్పించే లక్ష్యంతో వికసిత్ భారత్ – గ్యారంటీ ఫర్ రోజ్ గర్ అండ్ అజీవిక మిషన్ బిల్లు–2025 (VB-G RAM G Bill) ను కేంద్ర గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ నిన్న లోక్ సభలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. పేదల సంక్షేమం, గ్రామాల సమగ్ర అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. మహాత్మా గాంధీ కలలుగన్న స్వయం సమృద్ధి, అభివృద్ధి చెందిన గ్రామాల నిర్మాణానికి ఈ బిల్లు దోహదపడుతుందని అన్నారు. ఈ పథకానికి కేంద్ర ప్రభుత్వం 95 వేల కోట్ల రూపాయలకు పైగా ఖర్చు చేయనున్నట్లు వెల్లడించారు.

---------------------------

భారత మాజీ ప్రధాని భారతరత్న అటల్ బీహారీ వాజ్‌పేయి విలువలతో కూడిన రాజకీయాలు చేశారని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. కృష్ణాజిల్లా మచిలీపట్నంలో అటల్–మోదీ సుపరిపాలన బస్సు యాత్రలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌తో కలిసి వాజపేయి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. ప్రధానమంత్రి పదవిని సైతం వాజ్‌పేయి త్యాగం చేశారని మంత్రి నారా లోకేష్ గుర్తు చేస్తూ..

వాయిస్.. 25 సెకన్లు

---------------------------

మహిళల వన్డే ప్రపంచ కప్‌లో అద్భుత ప్రదర్శన చేసిన రాష్ట్రానికి చెందిన మహిళా క్రికెటర్ శ్రీచరణికి ప్రభుత్వం రెండు కోట్ల 50 లక్షల రూపాయల నగదు ప్రోత్సహకాన్ని అందజేసింది. ఈ మేరకు గుంటూరు జిల్లా ఉండవల్లిలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నివాసంలో క్రికెటర్ శ్రీచరణికి చెక్ ను ఈరోజు అందజేశారు. ఇటీవల జరిగిన మహిళల వన్డే ప్రపంచకప్ లో ఆమె ప్రతిభను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం ఆమెకు రెండు కోట్ల 50 లక్షల మేర నగదు ప్రోత్సాహంతో పాటు విశాఖపట్నంలో 500 గజాలు గల ఇంటి స్థలాన్ని కేటాయించింది. డిగ్రీ పూర్తయిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వంలో గ్రూప్–1 హోదా ఉద్యోగాన్ని కల్పించనుంది. ఈ మేరకు ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది.

---------------------------

భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను చేపట్టనున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి విజయకుమార్ తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించి నెల్లూరులో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో అవగాహన సమావేశాన్నిఈరోజు నిర్వహించారు. ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ.. ఒక పోలింగ్ కేంద్రంలో 12 వందల మంది ఓటర్లు ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ ప్రక్రియను నిర్వహించేందుకు బూత్ లెవెల్ అధికారులను నియమించి.. ప్రత్యేకంగా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

---------------------------

ప్రధానమంత్రి ఉచ్ఛతార్ శిక్ష అభియాన్ పథకం కింద డ్రోన్ సాంకేతికతలపై విద్యార్థులకు నెల్లూరులోని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు ఉపకులపతి అల్లం శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి దశలో వంద మంది విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు. డ్రోన్ ఆపరేటింగ్‌తో పాటు దాని పని తీరుపై కూడా అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. భవిష్యత్తులో మరింత మంది విద్యార్థులకు ఈ శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్” మనసులోని మాట కార్యక్రమం 129వ సంచిక ఈనెల 28వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది.“మన్ కీ బాత్” కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు 26వ తేదీ వరకు పంపవచ్చు.

---------------------------

ఆంధ్రప్రదేశ్, యానాంలో దిగువ ట్రోపో ఆవరణంలో ఈశాన్య దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో రానున్న 5 రోజులు పొడి వాతావరణం నెలకొనే అవకాశముందని వాతావరణ శాఖ అధికారి ఎమ్. వెంకట్రావు తెలియజేస్తూ...

వాయిస్...17 సెకన్లు

=====================